విద్యుత్ కోతలు.. రైతుల తిప్పలు

- బావుల వద్ద రైతుల పడిగాపులు
- అప్రకటిత కోతలతో పరేషాన్..
- పవర్‌గ్రిడ్‌పై ఓవర్ లోడ్‌తోనే
- కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి


మండలంలో ఎండిపోతున్న పొలం

ఎలిగేడు: రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పంట పొలాలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైంది. రైతులు తమ పంట పొలాలకు నీరు పెట్టేందుకు కరెంట్ సరఫరా కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పవర్‌గ్రిడ్‌పై ఓవర్‌లోడ్ పడుతుండటంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని అయోమయంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సరఫరా వేళలపై రైతులకు సరైన సమాధానం చెప్పలేక అధికారులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు ఏర్పాడ్డాయి.

మెసేజ్ వస్తేనే త్రీఫేజ్ సరఫరా...

మండలంలోని 12 గ్రామాల్లో మొత్తం 3630 వ్యవసాయ, 361 కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ యాసంగిలో రైతులు 14,500 ఎకరాల వరకు వరి పంటను సాగు చేశారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ప్రస్తుత్తం కొందరు రైతులు ఇంకా నాట్లు వేస్తుండగా మరి కొందరు రైతులు పొలాలకు నీరు పెడుతున్నారు. వ్యవసాయానికి 24గంటల కరెంట్ సరఫరా చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో అధిక విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేశారు. పవర్‌గ్రిడ్‌పై ఓవర్‌లోడ్ పడక ముందు ప్రతి రోజు ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు త్రీఫేజ్ సప్‌లై ఉండేది. అయితే పవర్‌గ్రిడ్‌పై ఓవర్‌లోడ్ పడుతుండడంతో నిర్ణీత సమయంలో అధికారులు విద్యుత్ సరఫరా చేయడంలేదు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక రైతులు అయోమయానికి గురవుతున్నారు. విద్యుత్ సరఫరాపై అధికారులకు సైతం స్పష్టమైన సమాచారం లేకపోవడంతో రైతులకు సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు. వరంగల్ సీఎండీ కార్యాలయం నుంచి మెసేజ్ వచ్చినప్పుడే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నామని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు.

మెసేజ్ వస్తేనే త్రీఫేజ్ కరెంట్



వరంగల్ సీఎండీ ఆఫీస్ నుంచి సబ్‌స్టేషన్‌కు మెసేజ్ వచ్చినప్పుడే త్రీఫేజ్‌ను సరఫరా చేయనున్నట్లు జరుగుతుంది. పవర్‌గ్రిడ్‌లో ఏర్పడిన సమస్యతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు ఆదేశాలు పాటిస్తున్నాం.

– సంపత్‌రెడ్డి, విద్యుత్ ఏఈ, ఎలిగేడు

సరిపోవడం లేదు



ప్రభుత్వం నిరంతర విద్యుత్ సరఫరా చేస్తుందనే ఆశతో ఐదెకరాల్లో వరి నాట్లు వేశాము. కొన్ని రోజుల నుంచి కరెంట్ సక్రమంగా రాకపోవడంతో పొలాలకు ఇప్పుడు ఇస్తున్న కరెంట్ సరిపోవడం లేదు. అధికారులు స్పందించి విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలి.

– ఇరుగురాల రాయమల్లు, రైతు

కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు



మూడెకరాల్లో వరిపంట సాగుచేశాను. గత కొన్ని రోజుల నుంచి కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. బావి వద్దకు వెళ్లితే కరెంట్ లేక గంటల తరబడి అక్కడే ఎదురు చూడాల్సి వస్తోంది.

–భూసారపు హరీశ్ గౌడ్, యువ రైతు

కంటి వెలుగును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

ఎలిగేడు: అర్హులు ప్రతి ఒక్కరూ కంటి వెలుగు పరీక్షలు వినియోగించుకోవాలని ఎంపీపీ తానిపర్తి స్రవంతి రావు అన్నారు. బుధవారం మండలంలోని నారాయణరావుపల్లిలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రేణుక, సర్పంచ్ మాడ కొండల్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ గోపు విజయ భాస్కర్ రెడ్డి, డాక్టర్ క్రిస్టినా, సిబ్బంది పాల్గొన్నారు.

జూలపల్లి: కంటి వెలుగు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి అన్నారు. మండలంలోని వడ్కాపూర్‌లో ఏర్పాటు చేయనున్న కంటి వెలుగు వైద్యశిబిరం ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ప్రోగ్రాం అధికారి కలీమొద్దీన్,వైద్యులు, సర్పంచులు, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: ప్రజలందరూ కంటి పరీక్షలు చేసుకోవాలని రామగిరి మండలం ఎంపీపీ ఆరెల్లి దేవక్క కోరారు. బుధవారం రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ లావణ్యతో కలసి ప్రారంభించారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దలు, మందులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, కార్యదర్శి పర్శరాం, నాయకులు పాల్గొన్నారు.

కంటివెలుగు సిబ్బందికి సత్కారం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో 2వ విడత కంటివెలుగు సేవలను అందించిన వైద్యసిబ్బందిని బుధవారం స్థానిక కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి సత్కరించారు. వార్డు పరిధిలోని అర్హులందరికీ నేత్ర పరీక్షలు నిర్వహించి మందులు, అద్దాలు అందించిన వైద్యాధికారులు, సిబ్బందికి భాగ్యలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది
కమిషనరేట్‌లో కంటి వెలుగు శిబిరం

గోదావరిఖని: కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో బుధవారం కంటి వెలుగు వైద్య శిబిరం నిర్వహించారు. సీపీఓ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, వివిధ విభాగాల సిబ్బంది, హోంగార్డ్స్ సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎం హెచ్‌ఎం డాక్టర్ కృపాబాయి, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మోహన్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ స్థల పరిరక్షణకు అధికారుల చర్యలు


ప్రహరీ నిర్మాణానికి తవ్వుతున్న కందకం

రామగుండం: పట్టణంలోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీ స్థల పరిశీలనపై సంబంధిత అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే బుధవారం సంబంధిత ఈఎస్‌ఐ అధికారుల ఇంజినీర్ల బృందం డిస్పెన్సరీని సందర్శించి స్థలానికి హద్దులు ఏర్పాటు చేసి ప్రహరీ నిర్మాణానికి మార్కు వేసి కందకాలు తవ్వుతున్నారు. ఇటీవల ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన చేసి నివేదికలు సత్వరమే కేంద్ర ప్రభుత్వానికి అప్పగించాలని కోరిన నేపథ్యంలో పట్టణంలో శిథిలావస్థకు చేరిన డిస్పెన్సరీ స్థల హద్దులను పరిశీలించి ప్రహరీ నిర్మించడంపై వంద పడకల ఆస్పత్రికి ఇదే స్థలాన్ని ఖరారు చేస్తున్నారా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు ఈ విషయమై గోప్యంగా వ్యవహరిస్తుండడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

క్రీడలతో నైపుణ్యం పట్టుదల పెరుగుతుంది

కాల్వశ్రీరాంపూర్: క్రీడలతో పట్టుదల, మానసిక దృడత్వం, నైపుణ్యం పెంపొందుతుందని తహసీల్దార్ అనుపమ రావు అన్నారు. సీఎం కేసీఆర్ క్రికెట్ కప్ టోర్నమెంట్‌ను బుధవారం తహసీల్దార్ టాస్ వేసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష, సర్పంచులు ఎంపీటీసీలు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కేసీఆర్ కప్ క్రికెట్ పోటీలు

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి నియోజకవర్గంలో నిర్వహిస్తున్న కేసీఆర్ కప్ క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో నాలుగు జట్లు 16,25 వార్డులు..28,36 వార్డుల జట్లు సెమిఫైనల్‌కు చేరాయని పట్టణ పార్టీ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం నుంచి మండల స్థాయి పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌కు జరిమానా

రామగిరి: మండలంలోని కల్వచర్ల శివారులోని అటవీశాఖకు చెందిన 719 కంపార్ట్‌మెంట్ నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌కు జరిమానా విధించినట్లు అటవీ శాఖ కల్వచర్ల సెక్షన్ అధికారి అమీరుద్దీన్ తెలిపారు. కల్వచర్ల శివారులోని రిజర్వ్ ఫారెస్ట్ నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారం అందుకున్న బీట్ అధికారి ఏ. మాధురి తనను సంప్రదించడంతో సంఘటన స్థలానికి వెళ్లగా మట్టి తరలిస్తున్న గ్రామానికి చెందిన బొబ్బిలి మోహన్‌కు చెందిన జేసీబీ, ఉప్పారపు సంపత్‌కు చెందిన ట్రాక్టర్‌ను స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు.

ఈజీఎస్ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

పెద్దపల్లిరూరల్: ఉపాధిహామీ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేలా ప్రభుత్వానికి విన్నవించాలని ఎమ్మెల్సీ కవితను బుధవారం కలిసి కోరామని పెద్దపల్లి ఈజీఎస్ జేఏసీ చైర్మన్ వెంకటేశ్ తెలిపారు. సెర్ప్ ఉద్యోగుల మాదిరిగానే తమకు కూడా వర్తింప జేయాలని, ఈ మేరకు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో తీర్మానించేలా చూసి న్యాయం చేయాలని కోరామని వివరించారు.

మేడిపల్లి గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

గోదావరిఖని: ఓసీపీ ప్రభావిత గ్రామం మేడిపల్లి అభివృద్ధికి సింగరేణి సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని మూడో డివిజన్ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ కోరారు. ఆర్జీ–1 జీఎం కె.నారాయణను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. గతంలో రూ.35లక్షల సీఎస్ఆర్ నిధులు అందజేసిన జీఎంను శాలువాతో సన్మానించారు. గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించేలా కృషి చేస్తానని జీఎం హామీ ఇచ్చారు.

ఆధార్ అనుసంధానం చేయడానికి సహకరించాలి

రామగిరి: మండల వ్యాప్తంగా ఓటరు లిస్టులో పేర్లు ఉన్నవారికి ఆధార్ అనుసంధానం కోసం రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని తహసీల్దార్ చల్లా రాంమోహన్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఓటరు కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ బీఎల్‌వోలను సంప్రదించి అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు రాజబాబు, సతీష్ కుమార్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ప్రకాశ్‌రావు


నియామక పత్రం అందుకుంటున్న ప్రకాశ్‌రావు

సుల్తానాబాద్: స్వర్ణకార సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పట్టణానికి చెందిన కందుకూరి ప్రకాశ్ (పెద్దన్న)ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకటస్వామి ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్వర్ణకార సంఘ భవనంలో ప్రకాశ్ రావును జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రంగు శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి రామోజు రాజు జిల్లా గౌరవ అధ్యక్షుడు బసవపాత్రుని వెంకట నర్సయ్య, జిల్లాకోశాధికారి కనపర్తి భాస్కర చారి, జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ కొండపర్తి నరహరి, పట్టణ అధ్యక్షులు విజయగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం మండల అధ్యక్షురాలిగా మనోహర

యైటింక్లయిన్‌కాలనీ: బీసీ సంక్షేమ సంఘం రామగుండం మండలం మహిళా అధ్యక్షురాలి గా యైటింక్లయిన్‌కాలనీకి చెందిన మీనుగు మనోహరను ఎంపిక చేసినట్లు పెద్దపల్లి జిల్లా బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి అరుణ బుధవారం తెలిపారు. ఈమేరకు ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులు మనోహర కృతజ్ఞతలు తెలిపారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి



పెద్దపల్లిరూరల్: డబుల్‌బెడ్ రూం ఇంటి కోసం దరఖాస్తులు ఈనెల 15లోగా చేసుకోవాలని పెద్దపల్లి తహసీల్దార్ వెంకటలక్ష్మి కోరారు. పెద్దపల్లిలోని తన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం గురువారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. అర్హులైన వారిని గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేస్తారని పేర్కొన్నారు.

ఓదెల: మండలం లోని 22 గ్రామాల్లో నిరుపేదలు డబుల్ బెడ్‌రూం కోసం ఈనెల 10 లోపు ఆయా గ్రామపంచాయతీల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కె రమేశ్ బుధవారం తెలిపారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందే


రిలేదీక్షలో సంతకం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: బీసీ కులాలకు చెందిన వారికి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను కల్పించాల్సిందేనని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు సూత్రపు పరమేశ్వర్ అన్నారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద 14 రోజులుగా సాగుతున్న రిలేదీక్ష శిబిరాన్ని బుధవారం నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. బీసీకులాల జనాభాను లెక్కించాలని, ఆ జనాభాకు అనుగుణంగ రిజర్వేషన్లు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్‌ను 52శాతానికి పెంచాలన్నారు. రిజర్వేషన్లు అమలుకు నోచక బీసీలు అన్నిరంగాల్లో అన్యాయానికి గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధు, సాగర్,రోహిత్, విష్ణు, కుమారస్వామి, సవిత, స్వప్న, శేషాద్రి, శోభ, శారద, రవికుమార్, వరలక్ష్మి, మహేశ్ తదితరులున్నారు.

రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న జెడ్పీచైర్మన్ మధు

మంథని: నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఆర్‌అండ్‌బీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు వినతిపత్రం అందించారు. పెద్దపల్లి కాటారం రహదారి మరమ్మతులు చేసి, రహదారిలో ఉన్న గ్రామాల సరిహద్దుల్లో నాలుగు లైన్ల రోడ్లు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. రహదారి రాష్ట్ర, జాతీయ రహదారులను కలుపుతుందని, కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రముఖ పుణ్యక్షేత్రానికి వెళ్లే రహదారి అని, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలతో పాటు తెలంగాణ నుంచి చత్తీష్‌గడ్ రాష్ట్రాలకు అనుసందానంగా రోడ్డు ఉపయోగపడుతుందన్నారు. రహదారుల అభివృద్ధికి రూ. 124 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

జ్యోతినగర్: బీహార్‌లోని పాట్నాలో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని సెయింట్ క్లేర్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. శశాంక్, స్నేహిత్ 100, 600 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబర్చినందుకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి గట్టయ్య తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం డామినిక్, పీఈటీ సుదేశ్ తదితరులు అభినందించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ గైడ్ అవార్డు టెస్టింగ్‌లో స్థానిక శ్రీరామ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు హైదరాబాద్‌లోని జీడిమెట్లలో జరిగిన టెస్టింగ్ క్యాంపులో 45 అంశాల్లో ఈ పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అనంత లక్ష్మీ, పాఠశాల కరస్పాండెంట్ ఎస్.వెంకటేశ్వర్‌రావు, పెద్దపల్లి జిల్లా సెక్రటరీ సూర్యదేవర జ్యోతి, గైడర్ విజయ తదితరులు విద్యార్థులను అభినందించారు.

సంక్షిప్త వార్తలు

పంటలకు సాగునీరు అందించాలి

పెద్దపల్లిరూరల్: యాసంగిలో సాగు చేసిన వరిపంటకు అవసరమైన నీరందక ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని పెద్దపల్లి మండలం కొత్తపల్లి, మూలసాల, కాల్వశ్రీరాంపూర్ మండలంలోని అంకంపల్లి, మడిపల్లి ప్రాంతాలకు ఎస్సారెస్పీ ఉప కాలువ 34 ఎల్ ద్వారా సాగు నీరందించేలా చూడాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని, సంబంధిత అధికారులను రైతులు కోరారు. వారబందీ పద్ధతిని సక్రమంగా అమలు చేసినా పంటలు ఎండకుండా ఉంటాయని తెలిపారు.

ప్రజాగోస.. బీజేపీ భరోసా

గోదావరిఖని: ప్రజాగోస..బీజేపీ భరోసాతో ప్రజల ముందుకు వెళ్లనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. బుధవారం నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతం చేయడంలో భాగంగా మండలాల వారీగా కోఆర్డినేటర్లను నియమించారు. మల్కాపూర్ గుండబోయిన లక్ష్మణ్‌యాదవ్, జనగామ గాండ్ల ధర్మపురి, గౌతమినగర్ సోమారపు లావణ్య, ఫైవింక్లయిన్ కాశిపేట శివాజీ, ఎల్బీనగర్ కోదాటి ప్రవీణ్, అడ్డగుంటపల్లి మాతంగి రేణుక, యైటింక్లయిన్‌కాలనీ బల్మూరి అమరేందర్‌రావు, రామగుండం వడ్డేపల్లి రామచందర్, అంతర్గాం క్యాతం వెంకటరమణ, పాలకుర్తి జక్కుల నరహరిని నియమించారు.

'లబ్ధి పొందుతూ దూషణలు సరికాదు'

రామగుండం: ప్రభుత్వ పథకాలు లబ్ధిపొందుతూ బీఆర్ఎస్ పార్టీని విమర్శించడం సరికాదని, పథకాలను రద్దు చేసుకుని పార్టీ వైఖరిని ప్రశ్నించాలని రాయదండి ఎంపీటీసీ కొలిపాక శరణ్యరెడ్డి హితవు పలికారు. బుధవారం అంతర్గాంలో మాట్లాడారు. రాయదండి, పెద్దంపేట గ్రామాల కుర్సుకమ్మి భూసమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కృషి చేస్తుంటే తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పుట్ట శ్రీనివాస్, ఆముల సరణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలబాలికలకు వసతిగృహాల ఏర్పాటు

పెద్దపల్లిరూరల్: ఎస్సీ విద్యార్థుల కోసం పెద్దపల్లి పట్టణంలో రెండు, సుల్తానాబాద్‌లో ఒకటి వసతిగృహాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి నాగలైశ్వర్ తెలిపారు. పెద్దపల్లిలో బాలికలకు, బాలుర కోసం పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లను, సుల్తానాబాద్‌లో బాలుర కోసం పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, స్థానిక ప్రజాప్రతినిధుల చొరవతో కలెక్టర్ సంగీత మంజూరు చేశారని పేర్కొన్నారు. వీటిని త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహాశివరాత్రి పోస్టర్ ఆవిష్కరణ

గోదావరిఖని: మహాశివరాత్రి, ఉగాది వాల్‌పోస్టర్‌ను ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనక్‌ప్రసాద్ బుధవారం స్థానిక జనక్‌భవన్‌లో ఆవిష్కరించారు. పండుగలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, ధర్మపురి, వికాస్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్య భద్రత ప్రభుత్వానిదే

మంథని: ఉద్యోగుల ఆరోగ్య భద్రత పూర్తిగా ప్రభుత్వానిదేనని టీఎన్జీయా జిల్లా అధ్యక్షుడు బహత్ కిషోర్ అన్నారు. ఉద్యోగులకు ఉచిత చికిత్స కల్పించేందుకు ప్రభుత్వం మూల వేతనం నుంచి ఒక శాతం ఆరోగ్య భద్రతకు ఇస్తామని ప్రకటించడం సంతోషకరమైన విషయమన్నారు. గతంలో లాగా హెచ్‌ఎస్‌ను ఆర్భాటంగా ప్రారంభించి తగ్గించేలా ప్రభుత్వాలు తీసుకున్న చర్యలను తప్పుపట్టారు. ఏ కార్పొరేట్ ఆస్పత్రిలోనైనా ట్రీట్‌మెంట్ ఉచితంగా అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్థానికులకే డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో నిర్మించిన డబుల్‌బెడ్ రూంలు స్థానికులకే కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు ఇళ్లు లేని నిరుపేదలు డిమాండ్ చేశారు. డబుల్‌బెడ్ రూంలు స్థానికేతరులకు కేటాయిస్తే ఆందోళనకు దిగుతామని కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ మాదాసు సతీశ్ హెచ్చరించారు. ప్రభుత్వం నిరుపేదలకు, స్థానికులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదన్నారు.

10న విద్యుత్ వినియోగదారుల సదస్సు

కోల్‌సిటీ: గోదావరిఖని విద్యుత్ సబ్ డివిజనల్ పరిధిలోని వినియోగదారులకు ఈ నెల 10న శారదానగర్‌లోని ఏడీఈ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు విద్యుత్తు వినియోగదారుల ఫోరం చైర్మన్ పి.సత్యనారాయణగౌడ్ ప్రకటనలో తెలిపారు.

12న ఆత్మగౌరవ సదస్సు

మంథని: వచ్చే నెల 12న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయాలని ఉద్యమకారుల సంఘ ప్రతినిధులు కోరారు. బుదవారం మంథని అంబేడ్కర్ చౌరస్తాలో సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంథని మండల శాఖ అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాములు

జూలపల్లి: పేదల సర్వతోముఖాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని టీపీసీసీ అధికార ప్రతినిధి, జెడ్పీటీసీ గంటా రాములు అన్నారు. బుధవారం మండలంలోని నాగులపల్లెలో హాథ్ సే హాథ్ జోడో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడపగడపకు తిరిగి ప్రజల కష్టాలను తెలుసుకుంటూ యాత్రను కొనసాగించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కందుకూరి అంజయ్య, యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్,అమిరిశెట్టి రామన్న, కొరెపు సంపత్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


ఆటగాళ్లను పరిచయం చేసుకుంటున్న ఎస్సై

ఓదెల: గ్రామీణ క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పొత్కపల్లి ఎస్సై ఎ మహేందర్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం సీఎం కేసీఆర్ క్రికెట్ కప్ ప్రారంభించి ఆటగాళ్లను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతో శారీరధారుఢ్యం పెరగుతుందన్నారు. ఆటలలో గెలుపు ఓటములు సహజమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కునారపు రేణుకదేవి, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతివ్వాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ పై ఈ ప్రాంత స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల ఏర్పాటుకు అనుమతివ్వాలని స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం నాయకులు కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డికి ఈ మేరకు వినతిపత్రం అందించారు. స్వాతంత్ర్య ఉద్యమంల ఈ ప్రాంత వాసుల పోరాట పటిమ గుర్తుకు వచ్చేలా వారి విగ్రహాలను ఏర్పాటు చేసుకునేందుకు మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానించాలని కోరారు. కార్యక్రమంలో ఓదెల దేవస్థానం చైర్మన్ మేకల మల్లేశం, స్వాతంత్ర్యోద్యమకారుల వారసుల సంఘం ,జిల్లా అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు వీరేశ్వర్‌రావు, మట్టరాంరెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

యైటింక్లయిన్‌కాలనీ: తెలుగు, హిందీ పండిత్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలని కోరుతూ బుధవారం రామగుండం కార్పొరేషన్ 19 వ డివిజన్ న్యూ మారేడుపాక ప్రభుత్వ పాఠశాల తెలుగు, హిందీ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీఎం కేసీఆర్ 2017లో తెలుగు మహ సభల్లో ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అందరితో సమానంగా పండిత్, పీఈటీలకు కూడా ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సారయ్య, సతీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ తనిఖీ

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల పెద్దపల్లి ఏసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏసీపీ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాల గురించి ఎస్సై శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే వారిపట్ల మర్యాదగా ప్రవర్తించాలని, అదే విధంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.